క్లుప్తంగా

రూ. 20 లక్షలతో డ్రెయినేజీ నిర్మాణం



మోపిదేవి: స్థానిక ప్రధాన 11వ నంబర్ కాలువ నుంచి శ్రీ భాషిత టాలెంట్ స్కూల్ వరకు పక్కా కాంక్రీట్ డ్రెయినేజీ పనులు శుక్రవారం ప్రారంభించారు. స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం, భక్తుల సౌకర్యార్థం దేవదాయశాఖ రూ.20 లక్షల నిధులు కేటాయించింది. ఆ మేరకు టెండర్ పిలిచి పనులు కేటాయించారు. సుమారు 250 మీటర్ల పొడువున శాశ్వత కాంక్రీట్ డ్రెయినేజీ నిర్మాణం చేపట్టనున్నట్లు ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన మున్సిపల్ కమిషనర్



పెడన: సాధరణ ఎన్నికల పోలింగ్, లెక్కింపు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించి ప్రశాంతంగా జరిపినందుకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డీకే బాలాజీని పెడన మున్సిపల్ కమిషనర్ బి.వెంకటరామయ్య కలిసి అభినందించారు. శుక్రవారం మచిలీపట్నం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్‌కు పుష్పగుచ్ఛాన్ని అందించి అభినందనలు తెలిపారు.

అధ్యాపకుల ఇంటింటి ప్రచారం



మోపిదేవి: ప్రైవేటు కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలలోనూ ఫలితాలు సాధిస్తున్నామని మోపిదేవి జెడ్పీపాఠశాల ప్లస్ బాలికల కళాశాల ప్రిన్సిపాల్ పి.జయంతి తెలిపారు. సెలవుల్లోనూ ఇంటింటా క్యాంపెయిన్ నిర్వహిస్తూ కళాశాలలో జరుగుతున్న ఉన్నత విద్యలో మార్పులు, ప్రత్యేకశ్రద్ధను శుక్రవారం తల్లిదండ్రులకు వివరించారు. ప్రభుత్వ కళాశాలలో చదివిన విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, విదేశీవిద్య, ఉద్యోగ అవకాశాలను వివరించి తమ కళాశాలలో చేర్పించాలని కోరారు. గత ఏడాది తమ కళాశాల విద్యార్థులు సాధించిన ప్రగతిని కళాశాల అధ్యాపకులు సురేష్, శ్రీనివాస్ వరించారు.

తాపీతో ఆటోడ్రైవర్‌పై దాడి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఇంటి దగ్గర పిల్లలు క్రికెట్ ఆడుకునే విషయంలో చోటు చేసుకున్న వివాదంలో ఆటోడ్రైవర్‌పై తాపీతో దాడి చేసి గాయపరిచిన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చిట్టినగర్ సాధుజాన్ వీధికి చెందిన తలాడి పైడి ఆటో నడుపుకుని జీవనం సాగిస్తుంటాడు. పైడి ఇంటి సమీపంలోనే అతని తమ్ముడు వరస అయ్యే పైడి చిట్టి కుటుంబం నివాసం ఉంటోంది. కొద్ది రోజుల కిందట చిట్టి పిల్లలు రోడ్డుపై క్రికెట్ ఆడుతుండటంతో వారించాడు. దీంతో చిట్టి భార్యతో పైడికి గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో శుక్రవారం సారంగం రోడ్డు వద్ద ఉన్న పైడికి, చిట్టికి గొడవ జరిగింది. గొడవలో చిట్టి తన వద్ద ఉన్న తాపీతో పైడి పొట్టపై గాయం చేశాడు. పొట్టపై తీవ్ర గాయం ఏర్పడటంతో వెంటనే విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేశారు.






కోడూరు మండలం పిట్టల్లంకలో మెరకతీత, దుక్కి పనులు చేసుకుంటున్న రైతు

సాగుకు రైతులు సన్నద్ధం

- వర్షాలు పడటంతో దుక్కులు ప్రారంభించిన రైతులు
- పొలాల చదును, మెరకతీత పనుల్లో బిజీ
- మరో 15 రోజుల్లో నారుమడి పనులకు సిద్ధమవుతున్న రైతులు

అవనిగడ్డ: దివిసీమ రైతులు ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఇటీవల వర్షాలు పడటంతో దుక్కులు దున్నే పనులు ప్రారంభించారు. పొలాలను చదును చేస్తున్నారు. మెరకతీత పనుల్లో రైతులు బిజీ అయ్యారు. ఘంటసాల, చల్లపల్లి మండలాల్లో బోర్ల కింద నారుమడులు పోసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు.

1.03 లక్షల ఎకరాల్లో..

అవనిగడ్డ నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 1.03 లక్షల ఎకరాల్లో వరిసాగు జరగనుంది. పలు సార్లు వర్షాలు పడటంతో పొలాలు పదునెక్కాయి. ఈ సమయంలో దుక్కులు బాగా వస్తాయి. దీంతో రైతులు పొలాలను దుక్కులు దున్నిస్తున్నారు. మరికొన్ని చోట్ల గట్ల పనులు, మెరకతీత పనులు చేపట్టారు. రెండు రోజుల క్రితం కురిసిన వర్షం దుక్కులకు అనుకూలంగా ఉండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వేసవి దుక్కులు చేపట్టిన రైతులు పచ్చిరొట్ట సాగుగా ఇప్పటికే కొన్నిచోట్ల జీలుగ, పిల్లిపెసర చల్లుకున్నారు. వర్షాలు పడటంతో ఇవి ఏపుగా పెరుగుతున్నాయి.

నారుమళ్లకు సన్నద్ధం..

ఘంటసాల, చల్లపల్లి, మోపిదేవి మండలాల్లో మరో పదిహేను రోజుల్లో నారమళ్లు పోసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. బోర్ల కింద ఉన్న పొలాల రైతులు నారుమళ్లు పోసుకునే పనులు చేసుకుంటున్నారు.

ముగిసిన గ్రంథాలయ శిక్షణ తరగతులు



అవనిగడ్డలో బహుమతులు అందుకున్న విద్యార్థులతో లైబ్రేరియన్, ఎంఈవో



విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న సంస్థ కార్యదర్శి నగేష్

గూడూరు: విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకత వెలికితీయడానికే కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు సంస్థ కార్యదర్శి ఎం.వి.డి.టి.నగేష్ అన్నారు. గత 25 రోజులుగా గూడూరు శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలకు సంస్థ కార్యదర్శి నగేస్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా నిర్వహిస్తున్న వేసవి విజ్ఞన శిబిరానికి విద్యార్థుల నుంచి మంచి స్పందన లభిస్తుందన్నారు. వేసవి సెలవులను వృధా చేసుకోకుండా చిత్రలేఖనం, ఆటల పోటీలు, పుస్తక పఠనం తదితర అంశాలపట్ల విద్యార్థులు ఆసక్తి పెంపొందించేందుకు వేసవి విజ్ఞాన శిబిరాలు ఎంతో దోహదపడుతున్నాయన్నారు. సీహెచ్‌సీ డైరెక్టర్ ఎం.ఎ.సలీమ్, గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా కార్యదర్శి మహ్మద్ బషీర్, గ్రంథాలయ అధికారి వై.శ్రీనివాసరావు, బీడీసీ సిబ్బంది పాల్గొన్నారు.

మచిలీపట్నంటౌన్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పౌర గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం శుక్రవారంతో ముగిసింది. స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంతో పాటు జిల్లాలోని పలు శాఖా గ్రంథాలయాల్లో ఈ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించారు. విద్యార్థులకు భగవద్గీత శ్లోకాలు నేర్పించటం, ధ్యానం చేయటం, కథలు చెప్పటం, కథల పుస్తకాలు చదివించటం, స్పోకెన్ ఇంగ్లిష్, డ్రాయింగ్ పోటీలు, పేపర్ క్రాఫ్ట్‌లో శిక్షణ ఇచ్చారు. ఆట, పాటలు నేర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించిన పలు పోటీల్లో విజేతలైన విద్యార్థులకు శుక్రవారం ముగింపు కార్యక్రమం సందర్భంగా ప్రశంసాపత్రాలను గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి ఎంవీడీటీ నగేష్, ఉపాధ్యాయులు వివేకానంద అందజేశారు. ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలకు వచ్చి పుస్తకాలు చదవటం అలవాటు చేసుకోవాలన్నారు. 21 రోజుల పాటు నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పలు అంశాల్లో శిక్షణ పొందటం అభినందనీయమన్నారు. పుస్తక పఠనం వారి జీవితాల్లో ఎంతో మేలు చేస్తుందన్నారు. చిలకలపూడి శాఖ గ్రంథాలయంలో కూడా విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు, బహుమతులను అందజేశారు. విశ్రాంత డెప్యూటీ రిజిస్ట్రార్ కె.రాఘవరావు, ఆర్టీసీ ఉద్యోగి కె.వెంకటేశ్వరరావు విద్యార్థులకు వీటిని అందజేశారు. ఈ కార్యక్రమాన్ని గ్రంథాలయ అధికారి డి.సుబ్రహ్మణ్యం తదితరులు పర్యవేక్షించారు.



ఘంటసాలలో విజేతలకు బహుమతులు అందిస్తున్న లైబ్రేరియన్ శరత్ కుమార్



జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ధ్రువీకరణ పత్రాలు స్వీకరించిన విద్యార్థులతో నిర్వాహకులు

అవనిగడ్డ: స్థానిక ప్రథమశ్రేణి గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిశాయి. గత నెల 15వ తేదీ నుంచి శుక్రవారం వరకూ పలు అంశాల్లో విద్యార్థులకు వేసవి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముగింపు కార్యక్రమాన్ని పురస్కరించుకుని శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు, పలు పోటీల్లో విజేతలకు ఎంఈవో అన్నపరెడ్డి పిచ్చయ్య, ఎస్‌బీఐ మేనేజర్ ఎస్. రామకృష్ణరావు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి జుజ్జువరపు ప్రభుదాస్ మాట్లాడుతూ వేసవి శిక్షణ తరగతరులకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన టీచర్స్ కె.భవాని, కె. అయ్యప్ప, కె.శ్రీకాంత్, పీఈటీ కె.స్నేహ, ఎం.శేషగిరిరావుని ఆయన అభినందించారు. సిబ్బంది కృపారావు, శ్రీదేవి, పద్మజ పాల్గొన్నారు.

చల్లపల్లిలో..

చల్లపల్లి గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి శిక్షణ తరగతులు ముగిశాయి. ఈ సందర్భంగా పలు అంశాల్లో శిక్షణ పొందిన వారికి గ్రంథాలయ అధికారి కె.గణేష్‌కుమార్ సర్టిఫికెట్లు అందించారు. పలు పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. వేసవి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకున్న విద్యార్థులు, శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను ఆయన అభినందించారు.

ఘంటసాల: స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు నిర్వహించిన క్విజ్, గన్నీ బ్యాగ్, మ్యూజికల్ చైర్స్, డ్రాయింగ్, క్యారమ్స్, చెస్, ఇతర ఆటల పోటీల్లో విజేతలకు శుక్రవారం బహుమతులు, మెరిట్ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ ఎం.శరత్ కుమార్, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు. కొడాలి గ్రంథాలయంలో విద్యార్థులు పుస్తక పఠనంతో పాటు వివిధ ఆటల పోటీలను గ్రంథాలయాధికారి ఎం.సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులను అందించారు. వేసవి శిక్షణ శిబిరాలు ముగిశాయని నిర్వాహకులు తెలిపారు.

వర్షాల్లో ఆరోగ్య జాగ్రత్తలు అవసరం

గుడ్లవల్లేరు: రుతు పవనాలతో ఎండలకు సెలవు వచ్చినట్లే. రాబోతున్న వర్షాల్లో గాలి, తేమ కారణంగా ప్రజలు వ్యాధి కారక ఇన్ఫెక్షన్లకు గురయ్యే ప్రమాదం ఉంది. తాగునీరు, ఆహారం విషయాల్లో కూడా ఈ సీజన్‌లో కొద్దిపాటి ఆరోగ్య చిట్కాలను పాటిస్తే ఎలాంటి అనారోగ్య సమస్యలు రాబోవని వైద్యులు చెబుతున్నారు. వర్షా కాలంలో కొన్ని ఆరోగ్య జాగ్రత్తలు తీసుకుంటే ఎలాంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉంటాయని గుడివాడ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వైద్యురాలు డాక్టర్ సీహెచ్.సుగుణావతి చెబుతున్నారు.

ఈ జాగ్రత్తలు అవసరం..

కలుషితం కాని నీటినే తాగాలి. మరిగించిన తాగునీటికి కొంత సమయాన్ని కేటాయిస్తే వ్యాధులు వర్షాల్లో దరికి చేరవు. అలాంటి వేడి నీటిని తాగితే రోగ నిరోధక శక్తి పెంపొందించవచ్చు. రోగ నిరోధక శక్తికి కష్టపడి పని చేయటం అవసరం. సరైన పోషకాహార సమతుల్య ఆహారం ద్వారా శరీరానికి పటుత్వం వస్తుంది. పరిశుభ్రత లేని ప్రదేశాల్లో తయారు చేసిన ఆహారానికి దూరంగా ఉంటే మంచిది. హోమ్ ఫుడ్‌నే ఎంజాయ్ చేస్తే ఆరోగ్యానికి చాలా మంచిది. పరిసరాలు పరిశుభ్రంగా లేకపోతే దోమలు వ్యాపిస్తాయి. ఇంటి చుట్టుపక్కల వర్షపునీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. డ్రెయినేజీ నుంచి పూల కుండీలతో సహా ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోకపోతే దోమలు వ్యాపించే అవకాశం ఉంది. వర్షంలో బయటకు వెళ్లని పరిస్థితులు ఏర్పడినపుడు తలపై గొడుగు, శరీరానికి జర్కిన్లు, కాళ్లకు షూస్ అవసరం. వర్షంలో తడిస్తే అనారోగ్యం. విశ్రాంతి లేక శరీరం బలహీనంగా మారి రోగ నిరోధక శక్తిపై ప్రభావితం అవుతుంది. నిద్రకు ఆరు గంటలు కేటాయిస్తే ఆరోగ్యంగా ఉంటారు.

మల్లేశ్వరస్వామికి లక్ష మల్లెల పూజ



మచిలీపట్నంటౌన్: నగరంలోని బచ్చుపేటలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి లక్ష మల్లెలతో అర్చన నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి కూడా లక్ష మల్లెల అర్చన నిర్వహించారు. ఆయల పూజారులతో పాటు ధర్మకర్తల మండలి వంశపారంపర్య చైర్మన్ ముత్తేవి రవికాంత్ తదితరులు పాల్గొన్నారు. పూజా కార్యక్రమానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

మెరిట్ స్కాలర్‌షిప్‌నకు విద్యార్థి ఎంపిక



జమీదగ్గుమిల్లి(పామర్రు): గ్రామంలో జెడ్పీ హైస్కూల్‌కు చెందిన వెన్నా మోహన్‌రామ్‌చరణ్ 2023–24 ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైనట్లు హైస్కూల్ హెచ్ఎం హనుప్రసాద్ తెలిపారు. మండలంలోని జమీదగ్గుమిల్లి జెడ్పీ హైస్కూల్లో శుక్రవారం ఎంపికైన విద్యార్థిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృషి, పట్టుదలతో జనరల్ కేటగిరిలో రామ్ చరణ్ ప్రతిభ కనబర్చి నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్ షిప్‌నకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థిని, శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను, పాఠశాల హెచ్ఎం అభినందించారు.

మలేరియాపై అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న మలేరియా అధికారులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మలేరియా వ్యతిరేక మాసోత్సవాలను పురస్కరించుకుని జక్కంపూడి కాలనీలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కాలనీలోని అర్బన్ హెల్త్ సెంటర్ నుంచి ర్యాలీ నిర్వహించగా, రాష్ట్ర సీనియర్ ఏంటమాలజిస్ట్ పి. కొండారెడ్డి, ఎన్టీఆర్ జిల్లా డీఎంఓ మోతిబాబు ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీలో మలేరియా వ్యాధి గురించి అవగాహన కల్పిస్తూ సాగింది. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించడంతో పాటు ఇంటి పరిసరాల్లో పనికి రాని సామగ్రిలో వర్షం నీరు నిల్వ ఉంచకుండా చూసుకోవాలని సూచించారు. కాలనీలోని ఖాళీ స్థలాల్లో నిల్వ ఉన్న నీటిలో దోమల లార్వా వృద్ధి చెందకుండా ఆయిల్ బాల్స్ ఏర్పాటు చేయడంతో పాటు కల్వర్టు వద్ద దోమల నివారణకు చర్యలు తీసుకుంటామన్నారు. జ్వరం వచ్చినట్లయితే వెంటనే మలేరియా పరీక్ష చేయించుకోవడంతో పాటు మందులను వాడాలని సూచించారు. ర్యాలీలో మలేరియా అధికారులు. సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మండలికి సన్మానం



ఎమ్మెల్యే బుద్ధప్రసాద్‌ను సన్మానిస్తున్న ఆలయ ఏసీ చక్రధరరావు

అవనిగడ్డ: అవనిగడ్డ నియోజకవర్గ నూతన ఎమ్మెల్యేగా ఎన్నికైన మండలి బుద్ధప్రసాద్‌ని పలువురు కలసి అభినందనలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకరచౌదరి, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్నతో పాటు పలుశాఖల అధికారులు, నియోజకవర్గంలోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీశైలం సచ్చిదానంద అవధూత పీఠాధిపతి శ్రీరుద్ర శివస్వామి, హైదరాబాద్ దైవజ్ఞ శ్రీనివాసమూర్తి బుద్ధప్రసాద్-విజలక్ష్మి దంపతులకు ఆశీస్సులు అందించారు. ఈ కార్యక్రమంలో మండలి వెంకట్రామ్, అశ్వినీకుమార్ పాల్గొన్నారు.

అవనిగడ్డ: పెండింగ్‌లో ఉన్న వేతనాలను ఇప్పించాలని కోరుతూ నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌ని పారిశుద్ధ్య కార్మికులు కోరారు. ఆయన స్వగృహం వద్ద శుక్రవారం బుద్ధప్రసాద్‌ని కలుసుకున్న పారిశుద్ధ్య కార్మికులు ముందుగా శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కొన్నినెలల నుంచి తమకు వేతనలు ఇవ్వక పోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. దీనివల్ల ఇబ్బందులు పడుతున్నామని వేతనాలు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని బుద్ధప్రసాద్‌ని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు పారిశుద్ధ్య కార్మికులు, గ్రీన్ అంబాసిడర్లు ఉన్నారు.

అధికారుల సన్మానం

మోపిదేవి: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ అధికారులు, వేదపండితులు అవనిగడ్డ ఎమ్మెల్యేగా నూతనంగా ఎన్నికైన మండలి బుద్ధ ప్రసాద్‌ను కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు నేతృత్వంలో శాలువా కప్పి, స్వామి చిత్రపటం, లడ్డూ ప్రసాదాలు అందించి సన్మానించారు. ఆలయ ప్రధానార్చకులు బుద్దు పవన్‌కుమార్‌శర్మ, అర్చకులు, అధికారులు, సిబ్బంది ఎమ్మెల్యే మండలికి శుభాకాంక్షలు తెలిపారు.

రూ.75 లక్షలతో వంతెన నిర్మాణం



పంటకాలువపై జరుగుతున్న వంతెన నిర్మాణ పనులు

కృత్తివెన్ను: ప్రదాన పంటకాలువపై రూ.75 లక్షల అంచనాలతో వంతెన నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. మండల పరిధిలోని యండపల్లి స్లోపు వద్ద బంటుమిల్లి–లక్ష్మీపురం ప్రధాన పంటకాలువపై షుమారు రూ.75 లక్షల ఎంపీ నిధుల నుంచి వంతెన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ప్రస్తుతం గ్రౌండ్ లెవల్ పనులు సాగుతున్నాయని త్వరలో ఫిల్లర్ నిర్మాణం కూడా పూర్తి చేయనున్నట్లు ఇరిగేషన్ ఏఈఈ రాజ్యలక్ష్మి తెలిపారు. మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి వంతెన నిర్మాణం కోసం నిధులను గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మంజూరు చేయగా వంతెన నిర్మాణ పనులు చేపట్టారు. రెండు గ్రామాలతో పాటు వేలాది ఎకరాలకు చెందిన రైతులకు ఈ వంతెన ఎంతగానో ఉపయోగ పడుతుందని సర్పంచ్ ప్రభాజీ తెలిపారు.

ఎమ్మెల్యే కాగితకు అభినందనలు తెలిపిన ఉద్యోగులు



ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌కు అభినందనలు తెలియజేస్తున్న డీఎస్పీ సుభాని తదితరులు

పెడన: పెడన ఎమ్మెల్యేగా విజయం సాధించిన కాగిత కృష్ణప్రసాద్‌కు పోలీసులు అభినందనలు తెలిపారు. శుక్రవారం మచిలీపట్నం డీఎస్పీ మహ్మద్ సుభాని, పెడన సీఐ నాగేంద్రప్రసాద్, బంటుమిల్లి, కృత్తివెన్ను, పెడన, గూడూరు మండలాలకు చెందిన ఎస్ఐలు, ఏఎస్ఐలు, ఇతర సిబ్బంది అభినందనలు తెలిపినవారిలో ఉన్నారు. పెడన నియోజకవర్గ వెలుగు ఏపీ కనకరావు, వెలుగు ఆర్పీలు, డ్వాక్రా లీడర్లు అభినందనలు తెలిపారు. ఆయా మండలాలకు చెందిన సచివాలయ ఉద్యోగులు, వివిధ శాఖలకు చెందిన అధికారులు, అనాధికారులు, టీడీపీ నాయకులు పెద్ద ఎత్తున కాగిత కృష్ణప్రసాద్‌కు అభినందనలు తెలియజేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కోడూరు: మండలంలో శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఆ శాఖ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అవనిగడ్డ నుంచి కోడూరు వరకు ఉన్న 33 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతులు, జంగిల్ క్లియరెన్స్ పనులు నిమిత్తం సరఫరాను నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ కోత ఉంటుందన్నారు. ప్రజలు సహకరించాలని విద్యుత్ అధికారులు కోరారు.

మచిలీపట్నంటౌన్: నగరంలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఎలక్ట్రికల్ ఈఈ ఎం. భాస్కరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్‌లైన్ల మరమ్మతుల కారణంగా నగరంలో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. మూడు స్తంభాల సెంటర్, కుమ్మరిగూడెం, బలరామునిపేట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

రామేశ్వరస్వామికి పవళింపు సేవ



రామేశ్వరస్వామికి పవళింపు సేవ నిర్వహిస్తున్న పండితులు

టేకుపల్లి(మోపిదేవి): మండలంలోని టేకుపల్లి గ్రామంలో బాల పార్వతీ సమేత రామేశ్వరస్వామి కల్యాణోత్సవాలు వైభవంగా నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం స్వామి పవళింపు సేవతో ఉత్సవాలు ముగిసినట్లు నిర్వాహకులు తెలిపారు. అంతకుముందు ఉదయం 6 గంటలకు సుప్రభాత సేవ, ప్రాతఃకాలార్చన, పంచామృత స్నపన, బలిహరణ, నీరాజన మంత్రపుష్పాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొట్నాలు దంచుట, వసంతోత్సవం, అవభృత స్నానోత్సవం, పూర్ణాహుతి నిర్వహించారు. సాయంత్రం ద్వాదశ ప్రదక్షిణలు, పుష్పశయ్యాలంకృత పవళింపుసేవ, ధ్వజ అవరోహణం అనంతరం పండిత సత్కారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న పుట్టి, బొగ్గరపు

గుడివాడరూరల్: శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుట్టి హరికుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం శాంతి వృద్ధాశ్రమం, కరుణాపీఠం వృద్ధాశ్రమాల్లోని వృద్ధులకు అన్నదానం, దుప్పట్లు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బత్తుల వీర రాఘవమ్మ 3వ వర్ధంతి సందర్భంగా ఆమె కుమారులు వెంకటప్రసాద్, సుధాకర్‌ల సౌజన్యంతో అన్నదానం, దుప్పట్ల పంపిణీ చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు బొగ్గరపు తిరుపతయ్య, నవ భారత్ ఖాదీస్టోర్ అధినేత సయ్యద్ గఫార్, కేశంశెట్టి అజయ్‌కుమార్, బాలాజీ పాల్గొన్నారు.

అందరి సహకారం మరువలేనిది

పామర్రు: సార్వత్రిక ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు, రాజకీయ పార్టీలు, అన్ని వర్గాల ప్రజలు అందించిన సహకారం మరువ లేనిదని పామర్రు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి బూసి శ్రీదేవి అన్నారు. స్థానిక కార్యాలయంలో ఆమె శుక్రవారం మాట్లాడుతూ నియోజకవర్గంలో పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియను నిర్వహించేందుకు దోహదపడిన అధికారులు, రాజకీయ నాలయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. నియోజకవర్గంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్న పోలీస్ శాఖ, అందించిన సేవలను ప్రశంసించారు.

